
-ఇచ్ఛాపురపు రామచంద్రం

**స్కూటరు మీద పొలానికి వెళ్తున్న సింహాచలాన్ని ఆపి-**

**'తమరిక్కమ్మండి' అన్నాడు తవిటయ్య.**

తవిటయ్యవి దశావతారాలు. బ్రాంచ్ పోస్టుమాస్టర్ దగ్గర బంట్రోతు పని నుంచి భార్యకి బ్యూటీ క్లినిక్ గురించి వివరించడం వరకూ అతనెన్నో పనులు చేస్తూంటాడు తెల్లవారితే. పల్లెటూరు కనుక తెల్లవారకుండా కూడా కొన్ని పన్లు చేస్తుంటాడు.

తమరిక్కమ్మండి - ఏ భాష? అని ఆలోచనలో పడిపోయాడు సింహాచలం. పేరు అలా ఉందనీ, అతను పల్లెలో ఉంటున్నాడనీ అతని గురించి కాని అతని ఎడ్యుకేషన్




గురించి కాని చిన్నంచనా వేస్తే దెబ్బ తగులుతుంది. కొడుకు పట్నమెళ్ళి చదువుకుంటాడని ఆ తల్లిదండ్రులకి ఆస్థాన జ్యోతిష్కుడు భవిష్యత్తు చెప్పలేదు బాలసారె నాడు. అంచేత దగ్గర్లో ఉన్న సింహాచలం అప్పన్న పేరు పెట్టేశారు.

అతను టౌనులో డిగ్రీ చదివాడు. ఏనుగు బతికున్నా చచ్చినా వెయ్యి వరహాలే (ఓల్డ్ రేట్) అని - డిగ్రీ పాసయినా ఫెయిలయినా డిగ్రీయే. అతను ఫైనలియరు పరీక్షలకు హాజరే కాలేదు కనుక ఫెయిలయినట్లవదు. అలాగే - అతనికి చదువుంది. పట్నంలో ఐదేళ్ళు పైన నివసించిన 'అర్బన్ సర్టిఫికే'టుంది. అతను చొక్కా, ప్యాంటూ వేసుకుంటాడు. స్కూటరు నడుపుతాడు. (ఆట్టే స్పీడుగా వెళ్ళడు కనుక నడుపుతూండటం కిందే లెక్క.) ఇన్ని అర్హతల కారణంగా అతనికి సింహాచ్ అనో సింహేష్ అనో మోడర్న్ నేమ్ ఉండి ఉండాలి. కాని అర్హతలకి తగిన అందలం దొరికే రోజులా ఇవి?

సింహాచలానికి తెలిసిన రెండు భాషల (ఇంగ్లీషు, తెలుగు)లలోనూ 'తమరిక్కమ్మండి' అన్న వాక్యానికర్థం తెలియలేదు.

అంతలో తవిటయ్య ఓ కవరు తీసి అందించి - 'ఇహిహి' అనే శబ్దం వొచ్చేలా నవ్వి - నమస్కారం చేసి ఓ పనయిం పోయిందన్నట్లు వెళ్ళిపోయాడు.

కమ్మ - కవరు. ఓహో! కమ్మంటే జాబు. ఉత్తరం అన్న మాట. కమ్మకట్టడం లాటి అర్థం కాదన్నమాట! నయమే. తొందరపడి వాడి కొకటిచ్చుకోలేదు. ఏం భాష బాబూ ఇది! ప్రాచీన సాహిత్యం కాబోలు.

అసలు... ఈ రోజుల్లో ఇంకా ఈ ఉత్తరాలేమిటి అనాగరికంగా?

టెలిఫోన్... ఇంటర్నెట్... వాళ్ళకి తెలీదు కాబోలు తనకి ఫోనుందని. మనుషులు ఎప్పుడు విద్యావంతులౌతారో?

పొలానికి వెళ్ళి ఫామ్‌హౌస్‌లో కూర్చుని కవరు తెరిచాడు. 'బావగారూ!' ఉత్తరంలోని పిలుపునకే తుళ్ళిపడిపోయాడు. ఎవరీ మరదలు?

'మా వారు మీకు తమ్ముడితో సమానం. అహ... అంతకంటే ఎక్కువ. వారంటే మీకు అభిమానమూ ఆపేక్షా అపారం. అందుకే - వారి స్నేహితులయిన మీకు - వారి భార్యనయి నేను - అరుణ అనబడే నేను - ఈ ఉత్తరం రాస్తున్నాను. తప్పయితే క్షమించండి.

వారు చెడిపోతున్నారు. అహ... చెడిపోయారు. నెల్లాళ్లయి - సూర్యుడు భూమ్మీద అస్తమించడమేమిటి, వారు బీర్‌లో ఉదయించేస్తున్నారు. క్యాలెండరు మారాక - అనగా అర్థరాత్రి దాటాకనే ఇంటికి వస్తున్నారు. ఇదేమని అడిగితే రోజుకొక - అదీ... రాత్రికకొక భేతాళ కథో చిలక కథో సాలభంజిక కథో చెప్పేసి పడుకుండి పోతున్నారు. సూర్యుడస్తమించడం మరచిపోవచ్చునేమో కాని వీరు సారా కొట్టుకి - అదే... బార్‌కి వెళ్ళడం మరచిపోవడం లేదు. ఇంకా పట్టించుకోకుండా వదిలేస్తే వారు బారుకి పునరంకితమై పోతారేమో అని నాకు భయమేస్తూంది. వారి కంటె మీరు పెద్దవారు. వారి గాఢ స్నేహితులు. కాలేజిలో కలిసి చదువుకున్నవారు. కనుక మీరొక్కసారి వొచ్చి - వారిని మందలించి - నా సంసారాన్నీ, మీ స్నేహాన్నీ నిలబెట్టుకోగలరని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు...

అరుణ.

అతని కాశ్చర్యమూ వేసింది, బాధా కలిగింది. ఒక నిట్టూర్పు వదిలి - సిగరెట్ అంటించి రెండో కాగితమున్నట్లనిపిస్తే అది కూడా చూశాడు పనిలో పనిగా. అదే కవరులో ఉంచిన అది - మొదటి ఉత్తరానికి జిరాక్స్ కాపీయే. కాకపోతే... 'ఇట్లు...' తరవాత కమల - అని ఉంది. ఒకే తల్లి కడుపులోంచి వచ్చిన కవల పిల్లల్లా ఒకే కవరులోంచి బయటపడిన రెండుత్తరాలకీ అదొక్కటే తేడా. అయినా స్నేహితుడి గురించి కదా అని ఆ ఉత్తరాన్ని కూడా చదివాడు సింహాచలం - కథలు బాగున్నాయని అదే పత్రిక యొక్క రెండు కాపీలు చదివినట్లు. చదివి-

సీరియస్‌గా ఆలోచించాలనుకున్నాడు. అంత సీరియస్‌నెస్‌కి సిగరెట్ చాలదనిపించింది. ఇది - స్నేహితుల సమస్య. స్నేహితుల భార్యల సమస్య. వాళ్ల ఫ్యామిలీ ప్రాబ్లం.

సీసా, గ్లాసూ, వాటరూ తెచ్చుకుని తాగుతూ సిగరెట్ కాలుస్తూ ఆలోచించసాగాడు. కిరణ్... అరుణకి భర్తయ్యే ముందే తనకి ఫ్రెండ్. కాలేజి క్లాస్‌రూముల్లో... హాస్టల్ రూములో... ప్లేగ్రౌండ్‌లో... సినిమాల్లో... తనకి మేట్. ఒట్టి మేట్ కాదు, మేటి మేట్. నాయకత్వ లక్షణాలు మెండుగా ఉండేవి. అంచేత స్టూడెంట్స్ యూనియన్‌కి సెక్రటరీ అయ్యాడు. కాలేజి అయ్యాక పొలిటీషియనవుతాడనుకునే వాడు తను వా[illegible] గురించి. ఎలాటి వాళ్లనేనా శాసించగలిగేవాడు. అలాటివాడు ఫ్యామిలీ లైఫ్‌లో ఫెయిలయ్యాడు! పిటీ! శశాంక కూడా సామాన్యుడు కాదు. అయ్యే చెట్టు ఆకుల్లోనే తెలుస్తుందని - ఇంటర్మీడియెట్ లోనే - ప్రకృతి సౌందర్యము, ప్రేమ కవతలి గట్టు లాటి కవితలు రాయడమే కాక స్వయంగా పాడేవాడు. జులపాల జుత్తూ, లాల్చీ... అప్పటికే సిగరెట్ అలవాటూ... పెద్దయ్యాక ఎంత గొప్ప సినీకవి ఐపోతాడో అనిపించేవాడు. కాని - ప్రేమలో పడి జీవితం నాశనం చేసుకున్నాడు. భవిష్యత్తును భగ్నం చేసుకున్నాడు. తెలివితేటలన్నీ బూడిదలో పోసిన బ్రాందీ ఐపోయాయి. చివరికి మ్యారీడ్ లైఫ్‌లో కూడా రాణించలేక పోతున్నాడు. చాలా దయనీయమయిన విషయమిది.

హింహాచలం మరో సిప్పు సిగరెట్ పీల్పూ తీసుకున్నాడు.

వివాహం విద్య నాశాయ... శోభనం సర్వనాశాయ - ట. అదేమో కాని - అవి రెండూ కూడా స్నేహ నాశాయ

అన్నది మాత్రం నిజమే. వాళ్ల భార్యలు టౌను భార్యలు. కిరణ్‌కీ. శశాంక్‌కీ తను స్నేహితుడే. అన్నీ. కాని... వాళ్ల భార్యలకి - తమ భర్త కిటువంటి స్నేహతుడుండటం నచ్చకపోవచ్చు. తల్లి - పొట్ట చూస్తే భార్య జేబు చూస్తుందట. భార్య - భర్త జేబునే కాదు, అతని ఫ్రెండ్స్ ఉద్యోగం, హోదా, నివసించే ఊరు కూడా చూస్తారని తనకి గట్టి నమ్మకం. డిగ్రీ పూర్తి చెయ్యని... పల్లెటూళ్లో వ్యవసాయం చేసుకునే తనని వాళ్లు తన భర్త ఫ్రెండ్‌గా అంగీకరించి ఆమోదించలేరని తను వాళ్ళ ఫ్యామిలీలకు దూరంగా ఉండిపోయాడు.

వాళ్ళిద్దరూ కంప్యూటర్ చేసి అక్కడే ఉద్యోగాలు తెచ్చుకున్నారు. వాళ్ళ మానాన వాళ్లు బాగానే ఉన్నారులే అనుకుని తనూ అప్పుడప్పుడు తప్ప వాళ్లని కలుసుకోవడంలేదు.

సమస్య లేదా పరిస్థితి అర్థమయింది - బుల్లి తెర మీదా పెద్ద తెర మీదా ప్రదర్శించబడే ఒక సినిమాలా ఉన్న ఆ రెండుత్తరాలనూ చదివేసరికి. ఇప్పుడిక పరిష్కారం లేదా తక్షణ కర్తవ్యం ఆలోచించాలి - అనుకునేసరికి - 'నే చెబుతాగా' అన్నట్లు కనిపించింది సీసా. గ్లాసులో పోసుని నీళ్లు కలిపి తాగుతూ మధ్యమధ్య సిగరెట్ కూడా తాగుతూంటే స్ఫురించింది కర్తవ్యం.

రైలు దిగేసరికి చీకటి పడుతోంది. అంటే... మనవాళ్ళు బార్‌లో ఉండే వేళ అనుకుంటా. రిక్షావాడికి బార్ అడ్రస్ చెప్పి పొమ్మన్నాడు. నిజానికది పైకి వైన్ షాపూ... లోపల లైసెన్స్ లేని బారూ. లైసెన్స్ మినహా దానికి లేనివి లేవు. రూఫ్ గార్డెన్‌లో కుర్చీలూ టేబుళ్ళూ... డ్రింక్స్ సప్లయ్‌లూ... సోడాలూ... ఐసూ... ఫుడ్డూ... మంచింగూ... అన్నీ ఉంటాయి.

సింహాచలం వెళ్ళేసరికి... ఒక టేబుల్ దగ్గర... వాళ్ళిద్దరూ. మిగిలిన ఖాళీ కుర్చీలు రెండింటిలోనూ ఒక దాన్లో అతను కూర్చున్నాడు. అప్పటికే వాళ్ళు రెండో రౌండ్ పూర్తి చేసేసి గుర్రమెక్కడానికి రెడీగా ఉన్నారు. వాళ్ళి తన్ని పట్టించుకోలేదు. మందునే పట్టించుకుంటూ. అంచేత ఇతనే... 'తమ్ముళ్లూ' అని పిలిచాడు - మెల్లగానే. వాళ్ళు కంగారు పడిపోయారు. 'అన్నా! అన్నా!' అంటూ లేచి నిలబడిపోయారు. 'కంగారూ ఆశ్చర్యమూ ఆనందమూ అంత లెవెల్లో అక్కర్లేదు మీకు. నిజానికి, నేనే ఓవరాక్షన్ చెయ్యాలి - ఎంతో బుద్ధిమంతులయిన నా తమ్ముళ్ళిలా బుద్ధిమంతులూ మందు బుద్ధులూ అయ్యాని. కాని... నేనాశ్చర్యపడను. ఎందుకంటే... సంపాదించే సిటీ మగాడు తాగకపోతేనే ఆశ్చర్యపడాల్సిన రోజులని - పల్లెటూరి రైతునయిన నాకు తెలుసు' - అంటూ వాళ్ల భార్యలు రాసిన ఉత్తరాలు వాళ్ళ కందించాడు. అంతలో బేరర్ రావడం - సింహాచలం ఆర్డరివ్వడం జరిగాయి. అతను తెచ్చాక 'మీరెందుకు తాగుతున్నారు?' అని సూటిగా అడిగాడు. 'మొదట అరుణ్ కిరణ్ చెప్పాలి'

'నాకు... పెళ్ళయ్యాక కాన్స్టిపేషన్ పట్టుకుంది. మందు - మలబద్ధకానికి మంచి మందని అంటేనూ' నీళ్లు నమిలాడు. ఆ నీళ్ళలో విస్కీ ఉంది. సింహాచలం భళ్ళున నవ్వి 'తాటిచెట్టెందుకెక్కావంటే దూడ గడ్డి కోసమన్నాట్ట నీలాటివాడే. నిజం చెప్పేయ్. మందు మీద నిజం చెప్పని వాడిని దేముడు కూడా క్షమించడు' అన్నాడు.

'క్షమించన్నయ్యా. నాది సైకలాజికల్ ప్రాబ్లమ్. నువ్వర్థం చేసుకోగలవని నా మనసూ హృదయమూ విప్పి చెప్పేస్తున్నాను. పెళ్ళయ్యేవరకూ నేను బాస్‌ని. ఒకరికి ఆర్డర్స్ ఇవ్వడమే కాని యువర్స్ ఒబీడియంట్లీ అంటే తెలియనివాణ్ని'

'నాకు తెలుసులే అది' చెప్పమన్నట్లు చూశాడు సింహాచలం - సిప్ చేసి.

'అదేమిటో... పెళ్ళయ్యాక... భార్యొచ్చిందా... చిత్రంగా... నాకు తెలియకుండానే. ఆవిడ నన్ను కమాండ్ చేయడం మొదలెట్టింది. అంతకంటే విచిత్రమేమిటంటే నేనూ ఆమెకు విధేయుడినై పోయాను. నాకు తెలియకుండానే... కాని... ఉండుండి ఒక్కొక్కప్పుడు నాలోని నేను మేలుకుంటాను. ఎలాటి వాడినెలా ఐపోయానంటూ నా మీద నేనే జాలి పడుతూంటాను. ఫలితంగా - నాలో సంఘర్షణ. భరించలేని సంఘర్షణ. నాలో... నేను బాస్‌గా ఉన్నప్పటికి - పూర్వ వైభవం


> 'తమ్ముడూ, కిరణూ... ఇంట్లో ఆవిడకి సబార్డినేట్ అయిపోయావన్న చింతలో బార్‌కొచ్చి బేరర్ మీద బాసిజం చూపించి ఇగోని తృప్తిపరచుకుందు కొస్తున్నానని ఒక కారణమూ, మలబద్ధకం పోగొట్టుకుందుకు మందు కొడుతున్నానని మరో కారణమూ చెప్పావ్. కాని... సారీ సోదరా... నీ రెండు కారణాలతోనూ నేనేకీభవించలేక పోతున్నాను.


గుర్తుకొస్తూంటుంది. అలాటి జీవితం... నేనే బాస్‌గా ఉండే జీవితం కావాలనిపిస్తుంది.' అతను చెబుతూంటే వచ్చాడు బేరర్.

'యస్ సర్?' ఏం కావాలన్నట్లు - అతి వినయ విధేయతలతో అడిగాడు - అదేదో ప్రకటనలోలా చేతులు కట్టుకుని.

అర్థమైందా అన్నట్లు చూశాడు కిరణ్ - సింహాచలం వేపు. 'ఇక్కడ - కొన్ని గంటలసేపు... నేను తాగేటంతసేపు నేనే బాస్‌ని. అందుకనే బార్‌కి మరుగడ్డాను. నాకీ జీవితం కావాలి. రోజులో - కనీసం కొన్ని గంటల సేపయినా నేను బాస్‌గా ఉండాలి.'

సింహాచలం ఓ నిట్టూర్పూ, సిగరెట్ పొగ వదిలాడు. శశాంక వేపు తిరిగాడు - నువ్వెందుకు తాగుతున్నావన్నట్లు చూస్తూ.

'నీకు తెలుసు - నాకు చిన్నప్పట్నించీ సౌందర్యమంటే ప్రాణమనీ, నా కవితలకదే స్ఫూర్తనీ...'

'బీర్‌లో నీక్కనిపించే సౌందర్యమూ వినిపించే కవిత్వమూ ఏమిటోయ్ మందుమతీ?'

'అలాగనే కన్నయ్యా...' అతని మాట ముద్దగానూ ముద్దుగానూ వస్తూంది. 'అటు చూడు. డాబా గోడకి ఒక చిత్రం. దాన్లో ఓ సుందరి తన యౌవన సౌందర్యాలనీ, అవయవాలనీ, సమస్తాన్నీ ఆరేసుకుంటోంది - ఒంటి మీద నైలాను పోగు కూడా లేకుండా. ఆ ఒంటి నున్నదనం... ఆ అంగాల పొందిక... కన్నులలో మత్తు... ఆ అవయవాల కొలతలు... అన్నీ అతిశయోక్తులూ అవాస్తవాలే. ప్రేక్షకులని రెచ్చగొట్టడానికే ఆ పొంగులూ హంగులూ...'

'నువ్వు - ప్రేమించి పెళ్ళి చేసుకున్నావ్‌గా? నీ ప్రేయసి... భార్య... కంటె సౌందర్యవతి మరెవరూ కనపడకూడదుగా నీకు? ప్రేమ నియమమో రూలో అదే కదా?' సందేహిస్తూ అడిగాడు సింహాచలం. అతనికి ప్రేమ గురించి అట్టే తెలియదు మరి.

'ప్రేమ! అదే నేను చేసిన పొరపాటు. ప్రేమ నన్ను మోసం చేసింది. ప్రేమ వొట్టి భ్రమే అన్నయ్యా. అంతవరకూ ఎంతో అందంగా కనిపించేది కమల. అదేవిటో పెళ్ళయిన ఆర్నెల్ల నుంచీ, తిలోత్తమ కాదు తాటకి నంటున్నట్లు తయారయింది. రోజులో కనీసం కొన్ని గంటలేనా సౌందర్యం కనిపించకపోతే - నా హృదయం ఎడారిలా పొడారిపోయి - జీవితం ఎండిపోయి... మండిపోయి... మరణమొచ్చేస్తుందన్నయ్యా నాకు. ఆ పోస్టర్‌లో పడుచు... చూవావ్‌గా... ఎంత అందమో... అది చూడనిదే... ఆమెను దర్శించుకోనిదే రోజు రోజే కాదు నాక...' సిప్ కోసం గ్యాప్ తీసుకుని-

'ఇక సంగీతం... బార్‌లో అంతా మ్యూజిక్కే. గ్లాసులతో 'ఛీర్స్' చెబుతూ తాకిస్తూంటే మధురమయిన గాజు సంగీతం... సోడాలు తెరిచేటప్పుడొచ్చే హారర్ సౌండు. తాగిన వాళ్ళు మాట్లాడే మాటలలో కర్కశత్వం... నవ్వులు... నిట్టూర్పులు... బాధలు... దుఃఖాలు... గుండె చప్పుళ్లు...'

'జాబితా చాలు.. ఫీలింగ్సూ చాలు. ఇక ఆపెయ్' కసిరాడు సింహాచలం. 'అర్థమైందిలే'


'థాంక్స్ బ్రదరూ. నీ కర్థమయితే చాలు. ప్రపంచంలో మరెవరికర్థం కాకపోయినా ఐడోంట్ కేర్...' అంటూ గ్లాసు నోటి కందించుకున్నాడు.

సింహాచలం కూడా గుక్కెడు పట్టించి - సీరియస్‌గా చెప్పసాగాడు. 'తమ్ముడూ, కిరణూ... ఇంట్లో ఆవిడకి సబార్డినేట్ అయిపోయావన్న చింతలో బార్‌కొచ్చి బేరర్ మీద బాసిజం చూపించి ఇగోని తృప్తిపరచుకుందు కొస్తున్నానని ఒక కారణమూ, మలబద్ధకం పోగొట్టుకుందుకు మందు కొడుతున్నానని మరో కారణమూ చెప్పావ్. కాని... సారీ సోదరా... నీ రెండు కారణాలతోనూ నేనేకీభవించలేక పోతున్నాను. పావలా ఆయుర్వేదం మాత్రతో పది విరేచనాలవుతాయి. కనుక - అందుకని మందు కొట్టక్కర్లేదు. పోతే... భార్యంటేనే బాసూ, భర్తంటేనే దాసూ. ఇది తెలుసుకోకుండా పెళ్ళికి తొందరపడటం - వెనక్కి తీసుకోలేని పొరపాటు. అబద్ధమాడినా స్ట్రాంగ్‌గా ఉండాలి. ఆడవాళ్లబద్ధమాడితే గోడకట్టినట్లుంటుందట. అంచేత మనం మగాళ్లం అబద్ధమాడితే ఐరన్‌తో కాంక్రీటేసినట్లుండాలి. అంతేకాని బారుకెందుకెళ్ళావంటే భగవద్గీత వినడానికన్నట్లుండకూడదు.' గ్లాసు నోట్లో వొంపుకుని - శశాంక్ వేపు తల తిప్పి - 'చూడు తమ్ముడూ! నీది వొట్టి పెళ్ళి కూడా కాదు. ప్రేమ పెళ్ళి. పెద్దలు చేసిన పెళ్ళి స్టీలు గ్లాసయితే ప్రేమించి చేసుకున్న పెళ్ళి గాజు గ్లాసు. బహు భద్రంగా కాపాడుకోవాలి. ఈ దేశంలో ఆడవాళ్ళకేనా మగాళ్ళకేనా - సౌందర్యమూ, సంగీతమూ వగైరాలు పెళ్ళితో సరి. పెళ్ళీ అవీ ఒక ఒరలో ఇమడవు. ఇలా అంటున్నానని ఈ అన్నయ్యని అపార్థం చేసుకోవచ్చు. జాతిపక్షపాతినే నేను. అందులోనూ మీరు నా సోదరుల్లాటి వారు. కనుక నే చెప్పేది జాగ్రత్తగా విని - ఆచరించండి. అప్పుడు భార్యా ఉంటుంది, బీరూ ఉంటుంది'

(మిగతా 29వ పేజీలో)

# పదచదరంగం-20

కూర్పు: ఎస్.పార్థసారథి



## ఆధారాలు

### అడ్డం

*1.*పకోడి
*5.*తాషామర్పా
*6.*యుద్ధంలో దీన్ని తిప్పడం శూరుల లక్షణం కాదు
*7.*దానవ ధర్మంలో ఉన్నది ఇదే
*11.*ఉత్తరాన దీన్ని జరిపిన కౌరవులు చిత్తుచిత్తు అయ్యారు
*12.*విష్ణుమూర్తి వక్షస్థలం
*14.*చుట్టూ నీరు మధ్యన దిబ్బ
*15.*గోత్రరుషి వశిష్ట మిత్రా వరుణతో కలిసి
*16.*దుంప పద్యం
*19.*రోజువారీ పని

### నిలువు

*1.*అమ్ము
*2.*కీకారణ్యం
*3.*ఒక ఆటవిక జాతి
*4.*యావన్మంది
*8.*డబ్బున్నవాళ్లు చేస్తున్న పని
*9.*తరంగం
*10.*దీనికి పనికి రానివాడు అప్రయోజకుడు
*13.*కుంభవృష్టి
*17.*అంజనం వేసి చూడు ప్రజలు కనిపిస్తారు
*18.*పిరికి వానికి లేని గుణం

### పదచదరంగం-19 సమాధానాలు:

అడ్డం
1.గోరువంక
3.ఎండమావి
7.పాలు
8.చందనం
9.మేరు
12.మందులు
13.నిర్యాసం
17.నులి
18.వరాలు
19.మేమే
22.పరమాణు
23.పైడిగృహం

నిలువు
1.గోచిపాత
2.వంగ
4.దప్పు
5.విదురుడు
6.కదకం
10.భిదురం
11.మర్యాద
14.కనుపాప
15.పిరాట్టి
16.త్వమేవాహం
20.ధీమా
21.పేడి

(9వ పేజీ తరువాయి)

'ఆ సూత్రమో, సులువో తొందరగా చెప్పు'

సింహాచలం సిప్పు కొట్టి చెప్పసాగాడు. 'ఇవాళ వ్యక్తిత్వ వికాసం, విజయానికి వంద మెట్లు, ప్రేమించీ పెళ్లి చేసుకోకుండా ఉండటం ఎలా? పెళ్లయినా కూడా సుఖంగా ఉండొచ్చు. లాటి జనరల్ బుక్స్ మార్కెట్‌లో కుప్పలు తెప్పలుగా పడున్నాయి. వాటిని వెదికితే 'భార్యకి తెలియకుండా బ్రాందీ తాగడం ఎలా?' లాటి పుస్తకాలు దొరక్కపోవు. ఏదేమయినా ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోండి' చెప్పదలచుకున్న విషయం మరీ సీరియస్ అని కాబోలు రెండు సిప్‌ల రెండు పఫ్‌లు (సిగరెట్ పీల్పులు) లాగి - 'రాత్రి మందు కొడితే నిద్ర పడుతుందనీ, తెల్లారే సుఖ విరేచన మౌతుందనీ కుంటి సాకులు చెప్పకండి. చిన్నపిల్లలు కూడా నమ్మరు. అలాగే - బార్టెండర్ల మీద బానిజమ్మూ, బార్‌లోని బొమ్మలోని సౌందర్యారాధనా కూడా తాడి చెట్టెందుకెక్కావంటే దూడ గడ్డి కోసం - అన్నట్లే...' ఒక సారా గాడు.

'మరయితే ఏం కారణాలు చెప్పాలన్నా?' ఒకేసారడగారిద్దరూ.

'అది నాకూ తెలియదు. తెసిందల్లా భార్యకి తెలీకుండా బ్రాందీ కొట్టడమే. అందుకు నా పద్ధతులు నాకున్నాయి. అవి మీకు సరిపడవు. తమ్ముళ్ళూ! మనం తాగే విస్కీకి భార్యల ఐస్ (కన్నుల) నుంచి వొచ్చే నీరు ఐస్ వాటర్ కాకూడదు. మన మగజాతి ఈపాటి సుఖంగా ఉండగలుగుతూందంటే కారణం భార్యల మంచితనమే.. వాళ్ళ ఉసురు పోసుకోకూడదు. తాగకుండా ఉంటే చాలా మంచిది. అలా ఉండలేమనుకుంటే తాగండి. కాని ఆ కంపు నింటికి తేకండి. మగజన్మెత్తాక ఎన్నో వెధవ పనులు చేయందే బతుకు తెల్లారదు. కాని జాగ్రత్తగా చెయ్యండి. ఓసారి సినిమా... మరోసారి ఆఫీసు పని... ఇంకోసారి చిన్ననాటి ఫ్రెండ్ రావడం... అలాటి కారణాలు చెప్పండి. ఇంటికి వెళ్ళేటప్పుడావిడకి చీరో, పూలో, స్వీట్లో... ఏదో ఒకటి పట్టుకెళ్లండి. వొట్టి చేతులతోనూ, కంపు నోటితోనూ పోక. ఇల్లు, ఇల్లాలు చల్లగా ఉంటేనే బీరూ, బ్రాందీ పదికాలాలు మనగలుగుతాయి. తెలివిగా తాగండి. నొప్పించక... తానొవ్వక.... అలాగే భార్యని బాధించక, బ్రాందీ మానక... అలాటి మార్గం ఆలోచించుకోండి మీ తెలివితేటలతో. అంతేగాని ఫ్యామిలీ వైఫ్‌ని బారుకెక్కించుకోకండి' అని ముక్తాయింపిచ్చి - 'మీరిక ఇళ్లకు వెళ్ళండి' అని వాళ్ళని పంపేసి తను మరో పెగ్గ్‌కి ఆర్డరిచ్చాడు సింహాచలం. ★